తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
7 మే 2026
పేజీలు : 08





# ఫీజుల దోపిడీపై ఆగ్రహం

- తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి
- తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్ఎస్) అధ్యక్షులు కవిత

**ఖైరతాబాద్ , మే06 (జనం సాక్షి) :** ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకు రావాలని తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షులు కల్వ కుంట్ల కవిత డిమాండ్ చేశారు.హైదరాబాద్ స్కూ ల్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజి గూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన "నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ" రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా వ్య వస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని కవిత విమర్శించారు. 50 శాతం నుంచి 120 శా తం వరకు స్కూల్ ఫీజులు పెరిగినా ప్రభుత్వం స్పం దించకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్య మంత్రి విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వహించ డం వల్ల సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవ డంలో లోపాలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించా రు.రాష్ట్రంలో సుమారు 64 లక్షల మంది విద్యార్థు లు ఉండగా, అందులో 65 నుంచి 75 శాతం వర కు ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారని ఆమె తెలిపారు. తల్లిదండ్రుల పిల్లల చదువుపై ఉన్న బ లహీనతను వ్యాపారంగా మార్చుకున్న విద్యాసం స్థలు అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్నాయని ఆరో పించారు. ప్రభుత్వానికి విద్య, ఆరోగ్యం వంటి రం గాలు బాధ్యతగా ఉండాలని, ఉచిత విద్య, ఉచిత వైద్యం అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఈ ఏడాది ఫీజులు 120 శాతం వరకు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కవిత అన్నారు. ప్రభుత్వ భూమిపై నడుస్తున్న ఈ పాఠశాలలోనే ఇంత భా రీగా ఫీజులు పెరగడం బాధాకరమని, దీనిపై ప్రభు త్వం తక్షణమే సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేశా రు. అలాగే పాఠశాల భూముల విషయంలో అక్ర మాలపై కూడా విచారణ జరపాలని సూచించారు .ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాజకీయ నాయకుల ప్రమే యం పెరగడం సరికాదని, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని అరికట్టాలని అన్నారు. ఫీజుల నియంత్రణ కోసం తమిళనాడు లేదా గుజరాత్ మోడల్‌ను అధ్యయనం చేసి, శాశ్వత అథారిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.ఫీజు రీయింబ ర్స్‌మెంట్ బకాయిలు సుమారు 11 వేల కోట్ల రూ పాయలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల అనేక కాలేజీలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఎంఎస్-7 జీవో ద్వారా తల్లిదండ్రుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయాలనే నిర్ణయం వెనుక కుట్ర ఉందని విమర్శించారు.ఈ సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాటం చేయాలని, జిల్లాల వారీగా కలెక్టరేట్ల ముందు నిరసనలు చేపట్టాలని కవిత పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే ఫీజుల పెంపును నియంత్రిస్తూ, గత ఏడాది స్థాయిలోనే ఫీజులను నిలుపుదల చేసే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఉచిత విద్య, ఉచిత వైద్యం అమలు చేయడం తమ పార్టీ కట్టుబాటని, ఈ విషయంలో మాట తప్పబోనని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు జరిగిన త్యాగాలను గుర్తుంచుకుని ప్రజల సంక్షేమం దిశగా ప్రభుత్వం పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో పలువురు నాయకులు పాలుగోన్నారు.



# నల్లకుంటలో చాయి పే చర్చ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మే 10న పరేడ్ గ్రౌండ్లో నిర్వహించబోయే నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు నల్లకుంట డివిజన్ యువమోర్చా ఆధ్వర్యంలో "చాయి పే చర్చ" కార్యక్రమం నిర్వహించారు. తదుపరి తిలక్ నగర్ లో కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం.శ్యామ్ రాజు, జిల్లా రాషె మోర్చ వైస్ ప్రెసిడెంట్ కె.లక్ష్మణ్, బిజెపి సిటీ వైస్ ప్రెసిడెంట్ కెజె బాబు, బిజెపి సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి ధర్మేందర్, నల్లకుంట డివిజన్ యువమోర్చా అధ్యక్షులు కె సుమన్, నల్లకుంట డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శులు ఎం.మల్లికార్జున్, ఎం.బీ కిషోర్ కుమార్, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో గంజాయి పట్టివేత

## రెండు కేసుల్లో ఇద్దరు అరెస్ట్



**ఉప్పల్, మే 6 (జనం సాక్షి):** ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించి న ప్రత్యేక దాడుల్లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏ-టీమ్ సిబ్బంది రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో మొత్తం సుమారు 3.459 కిలోల గంజాయి పట్టుబడగా, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు.రామంతాపూర్ గోకుల్ నగర్‌కు చెందిన బుచ్చిల్ల కౌశిక్ ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తెప్పించి స్థానికంగా విక్రయి స్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం అందడంతో అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సీఐలు బాలరాజు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ బిక్షపతి, కానిస్టేబుళ్లు రాకేష్, బాలు నాయక్, శిల్ప, డాన్, సాయి పాల్గొన్న బృందం కౌశిక్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 2.46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. అదే సమయంలో రామంతాపూర్ ఆర్టీసీ కాలనీలో మరో దాడిలో నమెల్లి వెల్తి ప్రవీణ్ వద్ద నుంచి 1.035 కిలోల గంజాయి పట్టుబడింది. రెండు కేసుల్లోనూ నిందితులను అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ తెలిపా రు.రామంతాపూర్ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ కట్టుది ట్టమైన చర్యలు చేపడుతోందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు అనుమానాస్పద కార్యక లాపాలను గమనించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఈ నెల 15న నీటి ఎద్దడి పై బీఆర్ఎస్ పాదయాత్ర



**రాజేంద్రనగర్, మే 6 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ సర్కిల్‌లో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యపై ప్రజల గోసను తెలుసుకుని పరిష్కారం కోసం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాదయాత్ర చేపట్టనున్నారని రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజ్ పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హైదర్ షాకోట్, బండ్లగూడ, కిస్మత్పూర్ డివిజన్లలో ప్రజల మధ్యకు వెళ్లి నీటి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు.ఈ కార్యక్రమానికి సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజ్ ఆధ్వర్యంలో నాయకులు కరపత్రం, వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజ్ మాట్లాడుతూ, ప్రాంతంలో నెలకొన్న తీవ్ర నీటి కొరత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారానికి ఒకసారి కూడా సరైన సరఫరా లేకుండా పరిస్థితి దారుణంగా మారిందని అన్నారు. మిషన్ భగీరథ వంటి పథకాలతో గతంలో నీటి సమస్యలను తగ్గించినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం వాటిని కొనసాగించడంలో విఫలమైందని ఆరోపించారు. వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలి, ఓవర్ హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలి, రోజు విడిచి రోజు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తూ, 15న జరగబోయే పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

**మొయినాబాద్, మే 6, జనంసాక్షి:** పేదల నడ్డి విడుస్తున్న మోడీ వికాసిత్ భారత్ అంటే ధరలు మీద ధరలు పెంచడమేనా. మొయినాబాద్ మండలం సిపిఐ కార్యదర్శి కే శ్రీని వాసు ఆధ్వర్యంలో.. బిజేనా గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్ అధ్యక్షతన నిరసన కార్యక్రమంలో చేపట్టడం జరిగింది కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్యాస్ ధరలు పెట్రోల్ ధరలు ధరలను డీజిల్ ధరలను విపరీతంగా పెంచే పెద్ద పేద ప్రజలను నడ్డి విడుస్తున్నాడని వికాసిత్ భారత అంటే ధరల మీద ధరలు పెంచడం అని మండిపడ్డారు మోడీ వచ్చినా తర్వాత దేశంలో పేదరికం పెరిగిందని నిరుద్యోగం పెరిగిందని ప్రజల యొక్క తలసరి ఆదాయం తగ్గిపోయిందని దుయ్యబట్టారు రోజురోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని రైతు కూలీలకు కార్మికులకు కర్షకులకు కనీస వేతనాలు లేక ఒకపక్క అల్లాడిపోతుంటే కుటుంబ భారం మోయలేక అన్యాయం రామచంద్రాన్ని అని బాధపడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం ధరల మీద ధరలు పెంచే పేద ప్రజల నడ్డి విడుస్తుంది అని ఆగ్రా వ్యక్తం చేశారు పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సురంగల్ మల్లేష్ ఉప్పరి సురేష్ కాసిం భాయ్ బాలమణి పెద్ద మంగళారం పాండు వడ్ల రాములు మల్లమ్మ పెంటమ్మ నరసింహులు తదితరులు పాల్గొన్నారు



# నిత్యావసర సరుకుల ధరలు

## ఆకాశాన్ని తాకుతుంటే సామాన్యులు బ్రతుకేదేట్లా?

- పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి
- హయత్‌నగర్‌లో సీపీఐ భారీ నిరసన
- అందోజు రవీంద్రాచారి, సామిడి శేఖర్ రెడ్డి




**హయత్ నగర్, మే 06 (జనం సాక్షి)** కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం పెంచుతున్న డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ హయత్‌నగర్ మండలంలోని లెక్చరర్స్ కాలనీ డివిజన్ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి లు హాజరై, ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్ ధరలను విపరీతంగా పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదల జేబులకు చిల్లులు పెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కమర్షియల్ సిలిండర్ ధరను అమాంతం పెంచేయడం పరోక్షంగా చిరు వ్యాపారులను, హోటళ్లు, టీ స్టాళ్ల నిర్వాహకులను రోడ్డున పడేయడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే సామాన్యులు ఎలా బతకాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించి సామాన్యులకు ఉపశమనం కలిగించకపోతే.. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ లెక్చరర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హై కోర్ట్ కాలనీ డివిజన్ కార్యదర్శి చెంది వెంకట్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పట్టేటి శేఖర్, గోల్కొండ నాగరాజు, బీసీ సంఘం మండల కార్యదర్శి కొండ బాలరాజు, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇసంపల్లి వెంకటేష్, బిఓసి నాయకులు సామెల్, రమేష్, రాములు, సిపిఐ వీరన్న గుట్ట నాయకులు అంబల రాములు, నీలం నవీన్, లస్కర్ కృష్ణ, సుమతి, కళ్యాణి, లక్ష్మీ, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పి.మైపాల్ రెడ్డి



**పెద్దేముల్ మే 06(జనంసాక్షి)** పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమింపబడిన పి.మైపాల్ రెడ్డి,ఈ మేరకు మంగళవారం పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి నాకు మండల పార్టీ అధ్యక్షుడుగా నియమించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్రాం,దూర్ శాసనసభ్యులు మహోహర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసి గ్రామాల్లో నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు దాంతోపాటు మండలంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ జూనియర్ నాయకులు సూచనలు తీసుకుంటూ పెద్దేముల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. గ్రామాల్లో ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలను నియమించి పని చేస్తానని అన్నారు.పార్టీ నాయకత్వం ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ అంజయ్య, ఉపాధ్యాక్షులు ఎస్.నారాయణరెడ్డి,మండల సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్ రెడ్డి, తట్టిపల్లి,సర్పంచ్ నారాయణ గౌడ్,తింసాన్ పల్లి సర్పంచ్ చంద్రకళ,మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యాక్షులు జితేందర్రెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, మాజీ యంపిటిసి విద్యాసాగర్, మాజీ సర్పంచ్ పి. ప్రకాశం, వెంకటయ్య, నాయకులు క్రిష్ణరెడ్డి, సాయిని శ్రీనివాస్ రెడ్డి, బందెన్న వికల్ గౌడ్, మధుసుధన్రెడ్డి, చిత్రికర్, లాల్రెడ్డి, తట్టెపల్లి నర్సిములు సాబేర్, హన్మంతు, సోహెల్, రాము, ఉచ్చరి వీరేశం, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ పరిధిలో ఫోన్ పే మోసాలు

**ఉప్పల్, మే 06(జనం సాక్షి):** ఉప్పల్ పరిధిలో ఫోన్ పే పేరుతో కొత్త రకం మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి, మీ ఫోన్ పే అకౌంట్‌కు సంబంధించిన సమస్య ఉందని, దాన్ని సరిచేయాలని చెబుతూ మోసాలకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో "మీ అకౌంట్ బ్లాక్ అవుతోంది", "క్యాష్‌బ్యాక్ వస్తోంది", "రివార్డ్ ఉంది" వంటి మాయ మాటలు చెప్పి, బాధితులను నమ్మించి ఓటీపీలు, లింకులు క్లిక్ చేయించడం జరుగుతోంది. ఇలా మోసగాళ్లు పంపిన లింక్‌పై క్లిక్ చేస్తే లేదా వారు చెప్పిన విధంగా యాప్‌లో చర్యలు తీసుకుంటే,




బాధితుల బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు క్షణాల్లో మాయమవుతున్నాయి. ముఖ్యంగా ఉప్పల్ పరిధిలోని హబ్సిగూడ, రామంతాపూర్, చిల్కానగర్ ప్రాంతాల్లో పలువురు ఈ మోసాలకు గురైనట్లు సమాచారం. ఈ ఘటనల నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తం అవుతూ, ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మవద్దని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓటీపీలు లేదా వ్యక్తిగత బ్యాంక్ వివరాలు చెప్పవద్దని సూచిస్తున్నారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకుండా ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా బ్యాంక్ లేదా అధికారిక యాప్ ద్వారానే చెక్ చేసుకోవాలని సూచించారు. మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండి ఇలాంటి మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆపదలో అండగా సేవాంజలి సేవలు

**ఉప్పల్ , మే 06 (జనం సాక్షి):** హైదరాబాద్ నగరంలోని ఉప్పల్, ప్రాంత0 లో సేవాంజలి స్వచ్ఛంద సంస్థ తన సేవా కార్యక్రమాలతో అవసరమైన వారికి అండగా నిలుస్తోంది. సంఘ సభ్యులు, దాతల సహకారంతో ఆర్థికంగా బలహీన వర్గాలను ఆదుకుంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రతి నిమిషం అందుబాటులో ఉండే కాల్ సెంటర్ ద్వారా అత్యవసర సహాయం అందించడంతో పాటు, ఫుడ్ బ్యాంక్ నిర్వహిస్తూ ఆకలితో బాధపడుతున్న వారికి ఆహారం అందిస్తోంది. అదేవిధంగా మార్కెట్లలో మిగిలిన కూరగాయలను సేకరించి అవసరమైన వారికి పంపిణీ చేయడం, అనాథలు మరియు నిరాధారులకు భోజనం అందించడం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తోంది. అంతేకాకుండా, అనాథల అంత్యక్రియలను నిర్వహించడం వంటి మానవతా సేవలను కూడా సేవాంజలి చేపడుతోంది. ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వాలంటీర్లు, సేవకులను సంస్థ ఆహ్వానిస్తోంది. మరిన్ని వివరాల కోసం 8985319936 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## డ్రగ్స్‌కు కఠిన హెచ్చరిక ట్రై చేస్తేనే ప్రమాదం



**ఉప్పల్, మే 06 ( జనం సాక్షి ):** యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్ గట్టిగా హెచ్చరించారు. "డ్రగ్స్‌ను ఒక్కసారి ట్రై చేసినా అది ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది" అని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే బయటపడటం చాలా కష్టమని, జీవితాన్ని పూర్తిగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని, తప్పుదోవ పట్టించే వ్యక్తుల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై కూడా డీసీపీ కీలక సూచనలు చేశారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి, బైక్‌పై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి పరిస్థితుల్లో ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. వేగ నియంత్రణ పాటించడం, సిగ్నల్స్‌ను గౌరవించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రజల ప్రాణ భద్రత కోసం పోలీసులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నారని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని డీసీపీ సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## దోమల నివారణ, గుర్రపు డెక్క తొలగింపుపై ప్రత్యేక దృష్టి



**ఉప్పల్ మే 06 ( జనం సాక్షి ):** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ చిన్న చెరువులో నెలకొన్న దోమల సమస్య, గుర్రపు డెక్క విస్తరణపై బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకుడు గంథం నాగేశ్వరావు, ఎంటమాలజీ విభాగం ఏ ఈ భారతి గారితో కలిసి చెరువును ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. చెరువులో విస్తరించిన గుర్రపు డెక్క (నీటి మొక్కలు) నీటి ఉపరితలాన్ని పూర్తిగా కప్పివేయడం వల్ల సూర్యకాంతి, ఆక్సిజన్ నీటిలోకి చేరకుండా అవరోధం ఏర్పడుతోంది. దీనివల్ల చెరువులోని చేపలు, ఇతర జలచరాలు జీవించలేని పరిస్థితి ఏర్పడి, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ మొక్కలు విస్తరించిన ప్రాంతాలు దోమలు, ఇతర క్రిమికీటకాలకు ఆశ్రయంగా మారి, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల నివారణ చర్యల భాగంగా చెరువు పరిసరాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ చర్యలతో దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని అధికారులు తెలిపారు. అలాగే చెరువులో విస్తరించిన గుర్రపు డెక్కను యంత్రాల సహాయంతో తొలగించి, నీటి ప్రవాహాన్ని మెరుగుపరచాలని, చెరువు శుభ్రతను కాపాడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దోమల సమస్య వల్ల రాత్రిపూట ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన నాయకులు సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురం శంకర్, చాంద్ పాషా, ఎంటమాలజీ సూపర్వైజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఈ చర్యలను స్వాగతిస్తూ, చెరువు శుభ్రత పనులు నిరంతరం కొనసాగించాలని కోరారు.

# హైదరాబాద్ క్రికెట్‌కు కొత్త దిశ
# హెచ్‌సీఏలో కీలక బాధ్యతలు చేపట్టిన ఏ.టి. రాయుడు



**ఉప్పల్, మే 06 ( జనం సాక్షి ):** హైదరాబాద్ క్రికెట్ అభివృద్ధికి మరింత బలం చేకూర్చే కీలక నిర్ణయాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ( హెచ్సిఏ ) తీసుకుంది. భారత జట్టుకు సేవలందించిన అనుభవజ్ఞుడైన క్రికెటర్ ఏ.టి. రాయుడిని హెడ్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా నియమిస్తూ అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకం ద్వారా హైదరాబాద్ క్రికెట్‌లో పారదర్శకత, ప్రతిభకు ప్రాధాన్యం, అభివృద్ధి లక్ష్యాలతో కొత్త దిశలో ముందుకు సాగాలని హెచ్‌సీఏ నిర్ణయించింది. ఈ బాధ్యతలతో రాయుడు రాష్ట్రంలోని క్రికెట్ కార్యకలాపాలన్నింటినీ సమగ్రంగా పర్యవేక్షించనున్నారు. క్లబ్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరిగే టోర్నమెంట్లు, ఆటగాళ్ల అభివృద్ధి కార్యక్రమాలు, కోచింగ్ విధానాలు, ఎంపికల ప్రక్రియ వంటి అంశాలన్నింటిపై ఆయన పర్యవేక్షణ ఉంటుంది. ముఖ్యంగా యువ ప్రతిభను వెలికి తీసి వారికి సరైన అవకాశాలు కల్పించడం, హైదరాబాద్‌ను మళ్లీ దేశ క్రికెట్ పటంలో ముందంజలో నిలపడం ఆయన లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. క్రికెట్‌లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ హెచ్‌సీఏ అవినీతి నిరోధక విభాగాన్ని (ఏ యు సి) కూడా ఏర్పాటు చేసింది. విజేందర్ పింగ్లే ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ ఎంపికలలో అక్రమాలు, లంచాలు, ఇతర అవకతవకలను పూర్తిగా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోనుంది. ఈ సందర్భంగా ఏ.టి. రాయుడు స్పష్టంగా మాట్లాడుతూ, "క్రికెట్‌లో అవినీతికి ఎలాంటి స్థానం ఉండదు. లంచాలు, ఎంపికలలో జరిగే అక్రమాలకు జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తాం. ప్రతిభ ఉన్న ఆటగాళ్లకే అవకాశాలు కల్పిస్తాం" అని తెలిపారు. ఆటగాళ్ల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగా మాత్రమే జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే కొత్త ప్రతిభను వెలికితీసేందుకు ఓపెన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు రాయుడు వెల్లడించారు. నగరంతో పాటు జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ టాలెంట్‌ను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మంచి ఆటగాళ్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక రాబోయే క్రికెట్ లీగ్ సీజన్ మే 12 నుంచి ప్రారంభం కానుందని హెచ్‌సీఏ ప్రకటించింది. ఈ సీజన్‌ను మరింత పారదర్శకంగా, పోటీతో కూడిన విధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మ్యాచ్‌ల నిర్వహణ, అంపైరింగ్, స్కోరింగ్ వంటి అన్ని విభాగాల్లోనూ నాణ్యతను పెంచే చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రికెట్ మౌలిక వసతుల అభివృద్ధికి హెచ్‌సీఏ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్త గ్రౌండ్లు, నెట్ ప్రాక్టీస్ సదుపాయాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు మెరుగైన అవకాశాలు కల్పించనుంది. మొత్తానికి, ఏ.టి. రాయుడు నియామకం హైదరాబాద్ క్రికెట్‌లో ఒక పెద్ద మార్పుకు నాంది పలుకుతున్నదని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. పారదర్శకత, ప్రతిభకు ప్రాధాన్యం, గ్రామీణ స్థాయిలో అభివృద్ధి వంటి అంశాలతో హెచ్‌సీఏ తీసుకున్న ఈ నిర్ణయాలు భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తాయని ఆశిస్తున్నారు.

## 6 నెలల నుండి ఇస్తాం ఇస్తాం అంటున్నారు
# కానీ ఇప్పటి వరకు ఇచ్చింది లేదు

### రిటైర్మెంట్ బకాయిలు ఏక మొత్తంలో చెల్లించాలి
### రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కి వినతి పత్రం సమర్పణ చేసిన ఇంజమూరి రఘునందన్, బక్కా జడ్సన్





**హయత్ నగర్, మే 06 (జనం సాక్షి)** రాబోయే 100 రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తామని జేఏసి నాయకులతో జరిపిన సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటికీ దాదాపుగా 93 మంది పెన్షనర్లు తమకు రావలసిన రిటైర్మెంట్ బకాయిలు రాక ఆవేదనతో, మనో వేదనతో చనిపోయారు. మరి 100 రోజుల్లో చెల్లిస్తాం అంటే దానికి కట్ ఆఫ్ డేట్ ఏమిటో స్పష్టం చేయలేదు. ఇప్పటికీ దాదాపు 25,000 మంది రిటైర్ అయితే, పైరవీల, కోర్టు ఆదేశాలతో కావచ్చు.. ఇప్పటి వరకు దాదాపు 4 వేల మందికి చెల్లించినట్లు తెలుస్తుంది. వారు పొగా మిగతా 21 వేల మందికి ముఖ్యమంత్రి చెప్పిన 6 వేల కోట్లు ఏ మూలకు సరిపోవు. కనుక ప్రభుత్వం 100 రోజుల్లో ఏ విధంగా ఎంత మొత్తం ఎలా చెల్లిస్తారో స్పష్టం చేయాలనీ డిమాండ్ చేస్తున్నాము. ముఖ్యమంత్రి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులతో జరిగిన చర్చల్లో 100 రోజుల్లో రిటైర్మెంట్ బకాయిలు ఇస్తామన్న విషయాన్ని రాష్ట్రంలోని రిటైర్ అయిన పెన్షనర్లు ఎవరూ కూడా విశ్వసించడం లేదు. ఎందుకంటే ప్రభుత్వ చర్యలు అనుమానాస్పదంగా ఉన్నవి. దానికి ప్రత్యక్ష ఉదాహరణ హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న కుప్పిగంతులే. దాదాపు 6 నెలల నుండి ఇస్తాం.. ఇస్తాం.. అంటున్నారు... కానీ ఇప్పటి వరకు ఇచ్చింది లేదు. రిటైర్మెంట్ బకాయిలు రాక, వైద్యం చేయించుకోవడానికి హెల్త్ కార్డులు చెల్లక నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రం లోని పెన్షనర్లు అందరూ తమకు రావలసిన బకాయిలు ఇప్పించుటకు గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరుతూ "సామూహిక విజ్ఞాపన పత్రములు" పంపడం జరుగుతుందని పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఇంజమూరి రఘునందన్, సామాజిక ఉద్యమకారుడు బక్కా జడ్సన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు అందరూ తమకు రావలసిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ గవర్నర్ కి వ్యక్తిగతంగా లేఖలు పంపాలని కోరుతున్నాం. విజ్ఞాపన పత్రము నమూనాను వాట్సప్ ద్వారా పెన్షనర్లు అందరికీ పంపడం జరిగిందని వారు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**రాజేంద్రనగర్,మే6(జనంసాక్షి)** గండిపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ సోదరుడు క్యాతం సత్యనారాయణ యాదవ్ కుమార్తె సుప్రజ, నార్సింగి మాజీ బీజేపీ అధ్యక్షుడు చిక్కిరి బిక్షపతి యాదవ్ కుమారుడు చిక్కిరి సాయి యాదవ్ ల వివాహం మొయినాబాద్‌లోని జెపిఎల్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఆయన తండ్రి వి. శ్రీశైలం యాదవ్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు మరియు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# మార్కుల కోసం కాదు
## విద్యార్థులలో మార్పు కోసం సమ్మర్ క్యాంప్

### తాండూరులో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి శిబిరం ప్రారంభం



**తాండూరు మే 6( జనంసాక్షి)** విద్యార్థులలో నైతిక విలువలు, ఆధ్యాత్మికత మరియు సామాజిక స్పృహను పెంపొందించడమే లక్ష్యంగా తాండూరు పట్టణంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ఘనంగా ప్రారంభమైంది. సమితి అధ్యక్షులు బాలకృష్ణ మరియు కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా రామకృష్ణ సేవా సమితి విద్యార్థుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఇంటర్, ఎస్ఎస్‌సీ విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక ధైర్యాన్ని ఇచ్చే మోటివేషన్ క్లాసులు నిర్వహించామని గుర్తుచేశారు. ఈ సమ్మర్ క్యాంప్ కేవలం మార్కుల కోసం కాదని, విద్యార్థులలో సానుకూల మార్పు తీసుకురావడం కోసమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతిరోజూ రెండు గంటల పాటు సాగే ఈ శిబిరంలో స్వామి వివేకానంద సూక్తులు. భగవద్గీత శ్లోకాలు. యోగా మరియు ధ్యానం. సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఆటలపై శిక్షణ ఉంటుందని వివరించారు. ప్రోగ్రాం కన్వీనర్ కేవియం వెంకట్ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకునే "వివేకానంద సాహిత్యం విద్యార్థులలో పెంపొందించడం కోసమే ఈ క్యాంప్ ఉద్దేశమని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటువంటి శిబిరాలకు పంపి ప్రోత్సహించాలని కోరారు. వ్యక్తిత్వ వికాసం యువ అవధాని ధీరజ్ మాట్లాడుతూ దేశ సంస్కృతి, విద్య ధర్మం అనేవి మనిషికి రెండు కళ్ల వంటివని, వాటిని ప్రతి భారతీయుడు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి గౌరవాధ్యక్షులు గాజుల బసవ రాజు, కమిటీ సభ్యులు మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అభ్యాస్ హై స్కూల్ కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపల్ కవిత దంపతులు, ఉపాధ్యాయులు రఘు, సరిత, నవనీత, జాహ్నవి, స్వప్న. విద్యార్థులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు
### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**యాలాల మే 6( జనంసాక్షి)** దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం. యాలాల మండలం అక్కంపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో, అగ్గనూర్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వరి ధాన్యం' కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. దొడ్డు రకం క్వింటాల్ కు రూ. 2,389/- సన్నాలకు రూ. 500/- బోనస్ తో మద్దతు ధర అందిస్తున్నామన్నారు. రైతుల సంక్షేమం కోసమే ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

## సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**యాలాల మే 6 (జనంసాక్షి)** యాలాల్ మండలం చెన్నారం గ్రామంలో శామలమ్మ మల్లయ్య, సత్యమ్మ సత్యయ్య, రాసమ్మ సాయిలు, శివలీల పరుశురాం ల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం మరియు ఎంకేపల్లి గ్రామంలో వెంకటమ్మ రాములు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. తమ సొంతింటి కళను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే బీఎంఆర్ కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

# ప్రజా పాలన కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యం అవసరం

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: చిలుక మధుసూదన్ రెడ్డి




**అబ్దుల్లాపూర్ మెట్టు, మే 6(జనం సాక్షి ):** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో రైతు వారం సందర్భంగా ప్రభుత్వ పథకాలు, వాటి అమలు విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని మార్కెట్ పాలకవర్గం నిర్వహించింది. అనంతరం ఉత్తమ పండ్ల రైతులను గుర్తించి అభినందించారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం కాంగ్రెసు ప్రభుత్వ ప్రత్యేకత అని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం రైతు భరోసా పథకం ద్వారా విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, నర్సింహా, అంజయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి



**చేవెళ్ల, మే 06 (జనంసాక్షి)** చేవెళ్ల మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం బెజిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలలో వెంటనే తగ్గించాలని మండల పార్టీ కార్యదర్శి మల్గారి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్యాస్ ధరలను పెట్రోల్ ధరలను డీజిల్ ధరలను విపరీతంగా పెంచి పేద ప్రజల నడ్డి విడుస్తున్నారని అన్నారు. వికసిత్ భారత్ అంటే ధరల మీద ధరలు పెంచడమా మడ్డిపడ్డారు మోడీ వచ్చిన తర్వాత దేశంలో పేదరికం పెరిగిందని నిరుద్యోగం పెరిగిందని ప్రజల యొక్క తలసరి ఆదాయం తగ్గిపోయిందని దుయ్యబట్టారు రోజురోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని, రైతు కూలీలకు కార్మికులకు కర్షకులకు కనీస వేతనాలు లేక ఒకపక్క అల్లాడిపోతుంటే కుటుంబ భారం మోయలేక బాధపడుతూ ఉంటే మోడీ మాత్రం ధరల మీద ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విడుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం ప్రభు లింగం, సిబిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబు జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, రామన్నగూడెం గ్రామ కార్యదర్శి పాపయ్య, భవన నిర్మాణ రంగ కార్మికులు మల్లయ్య, వెంకయ్య, యాదమ్మ, నరసింహులు, వెంకటమ్మ, రాజు, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా శేఖర్ నియామకం



**జిల్లేడు చౌదరి గూడ (జనం సాక్షి )** కాంగ్రెస్ పార్టీ మండలాల వారిగా నూతన అధ్యక్షులను నియమించింది ఇందులో భాగంగా జిల్లేడు చౌదరి గూడ మండల అధ్యక్షులుగా జాకారం శేఖర్ ని నియమించడం జరిగింది. తాను జాకారం గ్రామానికి సర్పంచ్ గా ఉన్నప్పటికీ మరో మండల అధ్యక్ష పదవి రావడం వల్ల సంతోషం వ్యక్తం చేశారు కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలకు బాధితయుతంగా ఉంటూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలాన్ని ప్రజలకు అందే విధంగా నా వంతు బాధ్యతగా చేపడుతానని పేర్కొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రతాప లింగంకు ఘన నివాళి

### దశదిన కార్యక్రమంలో భాగంగా ప్రతాపలింగం చిత్రపటం వద్ద నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



**జనం సాక్షి (ఫరూఖ్ నగర్ )** షాద్ నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ విశ్రాంతి ఉపాధ్యాయుడు ప్రతాప లింగం కు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఘన నివాళు లర్పించారు. ఇటీవల అనారోగ్యంతో చెందిన ప్రతాప లింగం దశదిన కార్యక్రమంలో భాగంగా ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రతాప లింగం తన ఉపాధ్యాయ జీవితంలో ఎంతోమంది మంది విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలిచారని క్రమశిక్షణ, నిబద్ధత, విలువలతో కూడిన బోధన ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రతాప లింగం కుమారులు విజ్ఞాన్ కళాశాల యజమాని విశ్వనాథ్, టీవీ9 రిపోర్టర్ శివకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎం.ఎస్. నటరాజన్, ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షుడు సభావత్ లక్ష్మనాయక్, కౌన్సిలర్ పిల్లి శేఖర్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, నాయకులు బిక్షపతి, సాయికుమార్ ఉన్నారు.

# ఇంధన ధరల పెంపుపై సిపిఐ ఆందోళన

## పోచారం అన్నాజిగూడ ఫ్లైఓవర్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన




**ఘట్కేసర్, మే 6 ( జనం సాక్షి ):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్ అన్నాజిగూడ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సిపిఐ నేతలు ఆందోళన కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, మండల సహాయ కార్యదర్శి సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.3100కు చేరుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. డీజిల్, పెట్రోల్‌పై లీటరుకు రూ.5 చొప్పున, గృహావసరాల గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదలతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న మరియు పెద్ద ఆహార వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరల పెంపును వెనక్కి తీసుకోవాలని, ప్రజలు ఈ పెంపులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సదాశివ, సిపిఐ నాయకులు మురళి, సయ్యద్ సాలార్, ఏఐటీయూసీ నాయకులు బి. పాండు, ఎన్. రాములు, బాల నరసింహ, ఎస్. అంజి, సయ్యద్ జాకీర్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

# తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



**రాజేంద్రనగర్,మే6(జనంసాక్షి)** మాజీ మంత్రి, ఎమ్మెల్యే బీఆర్ఎస్ శాసనసభాపక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి. సబితా ఇంద్రారెడ్డి ని రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ ఇంచార్జ్ శ్రీ కొలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు డి. రమేష్ ముదిరాజ్, కాటేదాన్, మైలార్దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, గుమ్మడి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నోముల రాము యాదవ్, రాజేష్ యాదవ్, కొంపల్లి జగదీష్, మైసిరెడ్డి, గంజి రాజు, మహేందర్ ముదిరాజ్, మన్నే శివ, రిషి ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ, ప్రజల పట్ల నిబద్ధత, కార్యకర్తలకు అండగా నిలిచే నాయకత్వం, కష్టకాలంలో ధైర్యం నింపే వ్యక్తిత్వం సబితా ఇంద్రారెడ్డి ని ప్రత్యేక నాయకురాలిగా నిలబెడుతున్నాయని అన్నారు. ఆమె ఆరోగ్యంగా, ఆనందంగా నిండు నూరేళ్లు జీవించి ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి

# కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు




**నిజాంపేట్ మే 6( జనం సాక్షి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని బుధవారం అభిమానులు, కార్యకర్తలు , నాయకులు సమక్షంలో జన్మ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, డిసిసి మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి , కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ , టిపిసిసి ప్రొటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు అంజలి యాదవ్, జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు , జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, బొంగు నూరి ప్రభాకర్ రెడ్డి , మైసి గారి శ్రీనివాస్, యాదగిరి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీ, మాజీ కార్పొరేటర్లు, సర్పంచ్లు, అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాలు భారీఎత్తున పాల్గొన్నారు.

## బైకును ఢీ కొట్టిన లారీ..మహిళా మృతి

# అత్త మృతి,అల్లుడికి తీవ్ర గాయాలు



**తలకొండపల్లి మే 06(జనంసాక్షి):** తలకొండపల్లి నుంచి షాద్ నగర్ కి వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం అతివేగంతో ఉన్న లారీ ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టడంతో బైకు నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో పాటు వెనకాల కూర్చున్న మహిళ ప్రమాద స్థలంలోని మృతి చెందింది. ఈ ఘటనపై తలకొండపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జానకిరామ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన బక్కి జంగమ్మ (55) తన అల్లుడు వల్లింపుల కుమార్,తో కలిసి తలకొండపల్లికి బైకుపై వస్తుండగా తలకొండపల్లి నుంచి షాద్ నగర్ కు వెళ్లే లారీ అతివేగంగా రావడంతో కాటన్ మిల్ సమీపంలోని క్రాసింగ్ వద్ద ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేస్తుందని తెలిపారు. మృతి చెందిన జంగమ్మ,ను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడిన వల్లింపుల కుమార్ ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఓవైసీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ వెల్లడించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి,జాగ్రత్తగా వాహనాలను నడపాలని,లేనిచో ప్రమాదాలకు గురై నిండు ప్రాణాలు పోయి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు.

# అంబర్పేట్‌లో అవేర్నెస్ ప్రోగ్రాం

**అంబర్పేట్ మే 6( జనం సాక్షి)** ఈ ఆధునిక ప్రపంచంలో చేతిలో సెల్ఫోన్ లేకుండా బయటకు అడుగుపెట్టలేకపోతున్నాం, పేద ధనిక అని తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు కూడా సెల్ ఫోన్ ను వినియోగిస్తున్నారు. సెల్ ఫోన్ ఎంత సౌకర్యంగా ఉంటుందో మరోవైపు అంతే ప్రమాదంగా ఉంటుందని అన్నారు. అంబర్పేట్ బతుకమ్మ కుంట వద్ద నిర్వహించిన సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డి సి పి రక్షితమూర్తి అన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు, ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్న య ని అన్నారు. నేర రహిత సమాజం కోసం ప్రజలు మరియు పోలీసుల మధ్య బలమైన బంధం ఏర్పడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే 100 కి కాల్ చేయాలన్నారు. సైబర్ నేరగాలను నియంత్రించేందుకు దర్యాప్తు సంస్థలు ఎన్నో అడ్డంకులు వేసిన మోసగాళ్లు కొత్త తరహాలో మోసాలను చేస్తున్నారు. మోసం జరిగిందని తెలిసిన వెంటనే 1930 కి ఫోన్ చేస్తే కొల్లగొట్టబడ్డ డబ్బును నేరగాడి ఎకౌంట్లో జమ కాకుండా ఆపేందుకు ప్రయత్నం చేస్తారు కానీ, చాలామంది ఆలస్యంగా ఫిర్యాదు చేయడం వల్ల ఫలితం లేకుండా పోతుంది.



అమాయకులైన ప్రజల కు డబ్బు ఎరగా చూపి వారి ఎకౌంటును వాడుకుంటున్నారు. కొత్త వ్యక్తులతో జాగ్రత్త గా ఉండాలని మీకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్ గాని ఓటీపీలు గానీ ఇవ్వవద్దని, అలాగే కొత్త లింకుల ను ఓపెన్ చేయవద్దన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ టి కిరణ్ కుమార్, ఇతర పోలీసు ఆఫీసర్లు,ప్రజలుపాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల్లో ప్రతి ఒక్కరు దైవచింతనలో భాగస్వాములు కావాలి

### శాసనసభా పతి, గడ్డం ప్రసాద్ కుమార్



**మోమిన్ పేట ఏప్రిల్ 06.( జనం సాక్షి)** మారుమూల గ్రామాల్లో ప్రతి ఒక్కరు దైవచింతన కార్యక్రమాల్లో భాగస్వాములు అయితే ఆ గ్రామంలో సుఖసంతోషాలు సమృద్ధిగా ఉంటాయని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నకొలుకుంద గ్రామంలో శ్రీ దుర్గా భవాని మాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి అసంపూర్తిగా ఉన్న ఆలయాన్ని చిన్న కోలుకుంద గ్రామ ఏకగ్రీవ సర్పంచ్ బసెట్టి విశాల సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల స్పీకర్ ఆయనను అభినందించారు. శ్రీ దుర్గా మాత కరుణ కటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో తులతూగాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే గ్రామాల్లో రాజకీయాలకతీతంగా దైవ కార్యక్రమాల్లో అందరూ సమన్వయంతో సంఘటితంగా కృషిచేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తంగేడి పల్లి పీఠాధిపతి శివయోగి శివాచార్య మహాస్వామి, అలాగే ధనసిరి అప్ప గారు, వీరేశ్వర శివాచార్య మహాస్వామి, జ్ఞానేశ్వరి మాత, లు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్ యాదవ్, ప్రవీణ్ కుమార్, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు, అలాగే ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి:ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి మే 6(జనంసాక్షి)** ఓటర్ల జాబితా నుంచి అసలైన ఓట్లు తొలగించకుండా, దొంగ ఓట్లు చేరకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కాకతీయ నగర్, వినాయక్ నగర్ డివిజన్లకు చెందిన బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని చంద్రగిరి కాలనీలోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్‌తో కలిసి ఆయన పాల్గొని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ సర్ ఈ నెల 11 నుంచి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ కు అవగాహన కలిగి ఉండాలి. క్షేత్రస్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొత్త ఓట్ల నమోదు, జాబితా పరిరక్షణపై దృష్టి సారించాలి. త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తామని, కార్యకర్తలే పార్టీకి బలమని వారు పేర్కొన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, త్వరలోనే క్రియాశీలక నాయకులకు ప్రాధాన్యతనిస్తూ డివిజన్ కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బద్దం పరుశు రాం రెడ్డి, రావుల అంజయ్య, ఫరీద్, బాలకృష్ణ, సూరి, అరుంధతి, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మాసగాళ్ల నర్సింహా వర్ధంతి సందర్భంగా బూర్గుల చైతన్య సేవ వృద్ధాశ్రమంలో అన్నదానం



ఫరూఖ్ నగర్ జనం సాక్షి :రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం పరిధిలో బూర్గుల గ్రామంలో ఉన్న చైతన్య సేవ వృద్ధాశ్రమంలో బుధవారం రాయికల్ గ్రామానికి చెందిన కీ శే మాసగాళ్ల నరసింహ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు రాధాకృష్ణ సరిత వారి కుమారులు అగస్య, అరవ్ లు ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. ఈ ఆశ్రమంలోని పలువురు సందర్భంగా మాట్లాడుతూ మాసగాళ్ల నరసింహ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని మరణ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం అత్యంత పుణ్యప్రదమైన మరియు సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమం అని కుటుంబ సభ్యులు తమ ప్రియమైన వారి జ్ఞాపకార్థం, వారి ఆత్మశాంతి కోసం వృద్ధులకు రుచికరమైన భోజనం, పండ్లు అందించడం ఇలాంటి సేవా కార్యక్రమం ద్వారా సానుకూలత, కరుణ, ఆనందం లభిస్తాయని ఇలా ప్రతి ఒక్కరు తమ తమ కుటుంబంలో జరిగే వివిధ కార్యక్రమాల సందర్భంగా ఇలా ఆశ్రమాలలో నిర్వహించి వారికి అండగా నిలిచి పలువురికి ఆదర్శంగా ఉండటం సంతోషదాయకమన్నారు..

## కోలన్ హన్మంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

### తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి



**నిజాంపేట్,మే 06: (జనం సాక్షి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన,తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ ఉ కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి. మర్యాదపూర్వకంగా కలిసి పులబోకే ఇచ్చి,శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావాలి గణేష్,ఏ ఆర్.సాధు యాదవ్, నరసింహ రెడ్డి,శ్రీశైలం యాదవ్,మహేందర్ రెడ్డి, గజ,గంట శివారెడ్డి,మహేష్, శ్రీశైలం ముదిరాజ్ బికెఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## తడి చెత్త పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కార్యక్రమం




**నిజాంపేట్ మే6( జనం సాక్షి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ బహదూర్‌పల్లి వార్డ్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమర్షియల్ షాపులు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నిబంధనను పాటించని వారికి "నో బిన్ నో లైసెన్స్" విధానం అమలు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలుకు అందించాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న సి అండ్ డి వ్యర్థాలను తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, ఎస్ ఎఫ్ ఏ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్‌ల దగ్గర కట్టుదిట్టమైన భద్రత

# సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుల ఆటకట్టు

### వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా




**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 6 (జనం సాక్షి):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్పీ ప్రతి విభాగం వారీగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను సమీక్షించారు. దర్యాప్తులో జరుగుతున్న జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. బాధితులకు సకాలంలో తక్షణ న్యాయం అందించడం పోలీసు వ్యవస్థ ప్రథమ కర్తవ్యమని, ప్రతి కేసును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. దొంగతనాల నియంత్రణపై సమీక్ష నిర్వహించి, ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని పాత కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. నేరస్తులను పట్టుకోవడంలో సాంప్రదాయ పద్ధతులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సీసీటీవీ ఫుటేజ్ విశ్లేషణ ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతులను ఉపయోగించి తక్షణమే నేరస్తుల జాడను కనుగొనాలని ఆదేశించారు. జిల్లాలో నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొత్త సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, పనిచేయని పాత కెమెరాల మరమ్మతులు ప్రతి కెమెరాను జియో-ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. తద్వారా నేరస్థలాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. మిస్సింగ్ కేసుల ఛేదనను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు చిన్నపిల్లలకు సంబంధించిన కేసుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని, వాటిని సవాలుగా తీసుకుని ఛేదించాలని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని సూచించారు. క్షేత్రస్థాయిలో బీట్ సిస్టమ్‌ను బలోపేతం చేయడం ద్వారా గ్రామాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపరచాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాత్రి పహారా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను మరింత కఠినతరం చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనల అమలులో ఎటువంటి రాజీ పడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పనులను పెంచాలని, కేసులలో అరెస్టులను పెండింగ్‌లో ఉంచకూడదని ఆదేశించారు. అరెస్ట్ పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి తక్షణమే చర్యలు తీసుకుని అరెస్టులు చేయాలని, పెండింగ్ ఎన్ బి డబ్ల్యూ ఎస్ పై దృష్టి సారించి వాటిని అమలు చేయాలని, కేసుల పరిష్కారాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డి సి ఆర్ బి డీఎస్పీ జానయ్య, డిటి సి డీఎస్పీ శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య , పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న జరిగే ప్రధాని జనగ్రహ బహిరంగ సభను విజయవంతం చేయాలి

### చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం




**చేవెళ్ల, మే 06 (జనంసాక్షి)** ఈ నెల 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ జనగ్రహ బహిరంగ సభను విజయవంతం చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకులు కె.ఎస్.రత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతనలో చేవెళ్లలో భాజపా నాయకులతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే కీలక వేదికగా ఈ సభ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఈ సభ మంచి అవకాశం అని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం ప్రతి గ్రామం, మండల స్థాయిలో సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో భాజపా నాయకులు మోహన్ రెడ్డి, డా.వైభవ్ రెడ్డి, జి.వెంకట్ రెడ్డి, సి.తిరుపతిరెడ్డి, సామ మాణిక్య రెడ్డి, అశోక్, పత్తి సత్యనారాయణ, కరికె శ్రీనివాస్, చీర శ్రీనివాస్, కుమార్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, అభి శేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రిషికేశ్, ఉమాశంకర్ రెడ్డి, బాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ, విఠల్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో విద్యుత్ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోండి

### షేక్ ఆరిఫ్ మహమ్మద్ డిమాండ్



రాజేంద్రనగర్,మే6(జనంసాక్షి)మణికొండలోని శివపురి వీకర్ సెక్షన్స్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు అత్యవసరంగా పరిష్కరించాలని "ది సిటిజన్స్ కౌన్సిల్" ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పత్రిక ప్రకటన ద్వారా రోడ్ నెం.2 జె వద్ద సమాధుల గోడ సమీపంలో ఉన్న ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్ స్థానిక అవసరాలకు సరిపోకపోవడంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. వేసవి తీవ్రతతో లోడ్ పెరగడం వల్ల సమస్య మరింత తీవ్రమైందని చెప్పారు. అలాగే గణేష్ మండపం సమీపంలో ఏర్పాటు చేయాల్సిన ఓవర్ హెడ్ కేబుల్ పనులు బడ్జెట్ కొరత కారణంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే అప్‌గ్రేడ్ చేయడం లేదా కొత్తదాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఓఎచ్ కేబుల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల సమస్యలను త్వరగా తెలుసుకొని స్పందించేందుకు అధికారులు ఎక్స్ ట్విట్టర్ వంటి సోషల్ మీడియా వేదికల్లో చురుకుగా ఉండాలని సూచించారు. సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## ముఖ్యమంత్రిని కలిసేందుకు అవకాశం కల్పించాలి



**కొడంగల్ మే 06 (జనం సాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు కొడంగల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ కమ్యూనిటి తరపున మేము ముఖ్యమంత్రిని కలసి మా సమస్యలు విన్నవించేందుకు అవకాశం ఇవ్వాలని మైనార్టీ నాయకులు గౌసన్ ఆధ్వర్యంలో కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో కాడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కొడంగల్ రోడ్డు విస్తరణలో తొలగించిన మహిబూబ్ సుభానీ దర్గా, స్మశాన వాటికలు, ఆషుర్ఖానాల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో యథా స్థానంలో పునర్ నిర్మించేందుకు హామీ ఇవ్వడం జరిగింది. కానీ నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. కావున ముఖ్య మంత్రిని కలిసి మా సమస్యను వివరించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాఫిజ్ అబ్దుల్ కరీం, షేక్ ఆదిల్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దు

### ఎస్కీ కనస్ట్రక్షన్ అండ్ దిమాలిశన్ వర్క్ షాప్‌లో జయేష్ రంజన్




**ఖైరతాబాద్, మే 06 (జనం సాక్షి) :** నిర్మాణ వ్యర్థా లను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని ఎస్కీ కనస్ట్రక్షన్ అండ్ దిమాలిశన్ వర్క్ షాప్ లో ప్రభు త్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ జయేష్ రంజన్ అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలి టన్ ఏరియా, అర్బన్ డెవలప్ మెంట్, స్పోర్ట్స్ డి పార్టుమెంటు సహకారంతో గచ్చిబౌలిలోని ఇంజనీ రింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన రివైజ్డ్ కన స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ వేస్ట్ మేనేజి మెంట్ రూల్స్ 2025 పై జరిగిన వర్క్ షాప్ లో జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గించారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మెన్ సి.శేఖర్ రెడ్డి, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవల ప్మెంట్ కౌన్సిల్ తెలంగాణ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనర్ కమీషనర్ రఘు ప్రసాద్, జి.హెచ్.ఎంసి రిటైర్డ్ ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వర్ రావు, సోమ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీర్ అండ్ కాంట్రాక్టర్స్ డైరెక్టర్ సోమ శశాంక్ రెడ్డి, డెలాయిట్ సి అండ్ డి అధికారి అరవింద్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఎస్కీలోని సెంటర్ ఫర్ క్లయిమే ట్ చేంజ్ డివిజన్ హెడ్ డాక్టర్ చంద్రకళ, ఫ్యాకల్టీ అది నరేష్ కార్యక్రమ సమన్వయ కర్తలుగా వ్యవ హరించారు.

## కొందుర్గు కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా 'పురుషోత్తం రెడ్డి



**కొందుర్గు(జనంసాక్షి)** మండల కాంగ్రెస్ పార్టీలో నూతన శకం ఆరంభమైంది. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డిని నియమించింది. పురుషోత్తం మొదటి నుంచి పార్టీ పట్ల చూపిస్తున్న అంకితభావం, నిబద్ధతను గుర్తించిన హైకమాండ్ ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో ఆయనకున్న బలమైన సంబంధాలు, అందరినీ కలుపుకునిపోయే తత్వం ఈ నియామకానికి ప్రధాన కారణమయ్యాయి. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అగ్రనాయకత్వానికి, తనకు అండగా నిలిచిన స్థానిక నాయకులకు పురుషోత్తం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని మండలంలో అగ్రపథాన నిలిపేందుకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఉద్ఘాటించారు. పురుషోత్తం నియామకంతో కొందుర్గు మండల కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత పుంజుకుంటుందని నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.